# కలకానిది




గదిలోనించి విసురుగా వెళ్లిపోయింది. కోపంగానే అనుకుంటా. కళ్లలో ఆలోచనలు చదివే అవకాశం ఇవ్వలేదు కానీ బాగా ఇబ్బంది పడిపోయి వుండాలి. అవును. తప్పదు. ఆడవాళ్ళకు అందరికీ కాక పోయినా కొంతమందికయినా ఇలాంటి పరిస్థితి అప్పుడప్పుడు ఎదురవుతుందను కుంటాను. ఎందుకంటే ఎవరైనా ఎప్పటి అవకాశాన్ని అప్పటికి విలువైనదిగా అనుకుంటారు కాబట్టి.

ఏమిటీ సమస్య?

పొరపాటు చేశానేమో అనిపించింది. ఆ సంభాషణ గురించి నాకు తెలుసునని విమలకు

తెలీదు. అందుకే బాగా షాక్ ఫీలయ్యింది.

సాయంత్రం ఆరుగంటలు కావస్తున్నప్పుడు ఆమె నా గదిలోకి వచ్చింది. మొహం నిండా వున్న విచారాన్ని నెట్టేసే ప్రయత్నంలో చిరునవ్వును పెదవులమీద అంటించుకున్నట్టుంది.

సినిమాకు వెళదామన్నది. కానీ నాలో హుషారు ఏదీ? ఆ సంభాషణ ఇంకా నాకు వినపడుతూనే వున్నట్టుంది. ఆమె రాక కోసమే ఎదురు చూస్తున్నాను.

ఒంట్లో బావుండలేదని అన్నాను. నిజానికి బావుండనిది మనసులో. ఒకర్నొకరు ఎంత బాగా అర్థంచేసుకున్నామని అనుకున్నా ఏదో ఒకవైపు నించి అపనమ్మకం తలెత్తి బయటకు చూస్తూనే వుంటుంది. అందుకే నిరంజన్ గురించి అడిగాను. పర్యవసానంగా విమల కొంతసేపటికి ఆ గదిలోనించి బయటకు వెళ్ళిపోయింది.

కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాను.

గదిలో దీపం వెలుతురు కిటికీలోనించి బయటకు పడుతోంది. దూరంగా అంతా చీకటి. ఎక్కడో వీధి దీపం వెలుగుతోంది.

విమల తన గదిలో కుర్చీలోనో లేక కిందనో కూలబడి ఏడుస్తూ వుంటుందా? జాలని అనిపించింది.

బాగా బాధ పెట్టానేమో! నిర్దయగానే అడిగాను.

గాలి రివ్వున వీస్తోంది. గుండెలో రెక్కలు తెగిన పక్షిలా పడివున్న ఒక్కటే ఆలోచన. విమల గురించి నేను తీసుకునే నిర్ణయం యేమిటి? ఏదో ఒకటి చెప్పక తప్పదు. ఒక ఒరలో రెండు కత్తులను ఇమిడ్చే ప్రయత్నాన్ని విమలకూడా చేస్తుందని నేననుకోను.

విమల ఓ బేంక్ ఉద్యోగిని. పెళ్లయిన మర్నాడే మొగుడ్ని ఓ యాక్సిడెంటులో పోగొట్టుకున్న అందమైన యువతి. మొగుడ్ని తన ఒడిలోకి లాక్కున్న ఏ శక్తిమీదా కోపమున్నట్టుగా విమల కనపడదు. ఆమె స్టోరీ తెలిసినవాళ్లకే ఆమె ఒక విడో. తెలియని వాళ్లకు పెళ్లికాని ఓ అందమైన ఆడపిల్ల.

మొదట్లో నేనూ ఆమెకు పెళ్లికాలేదనే అనుకున్నాను. ఎందుకంటే మొగుడుపోయిన గుర్తులు ఆమె శరీరంమీద ఎక్కడా కనపళ్లేదు. ఆవిచారం కూడా ఆమెలో లేదు.

ఓ ఫంక్షన్‌లో పరిచయమయ్యింది. నేనుకూడా ఓ బేంక్ ఉద్యోగిననీ, పెళ్లికాలేదనీ తెలిసిన తర్వాత నా స్నేహం పట్ల విమల చొరవ ఎక్కువగా కనపడింది.

తప్పులేదు. మొగుడుపోవడంలో ఆమె పాత్ర ఏముంది? తిరిగి వసంతాన్ని కోరుకుంటున్నది ఆమె. విమల గురించి- నాతో కలుపుకుని ఆమె భవిష్యత్తు గురించి

ఒకరోజు రాత్రి ఆలోచించాను.

ఆమెను పెళ్లిచేసుకోవడానికి నాకు ఎటువంటి అభ్యంతరం కనిపించలేదు. అందం-చదువు-ఉద్యోగం వున్నాయి. ఎటొచ్చీ ఒక్కటే మచ్చ. ఆ మచ్చ గురించి నాకు బాధలేదు. అది నా దృష్టిలో ఓ దురదృష్టకరమైన సంఘటన. అంతే.

మొదటిసారిగా ఆమె నన్ను తన గదికి టీ తాగటానికి రమ్మని పిలిచింది. వెళ్లాను. ఆమె పెళ్లి గురించి చెప్పింది. ఆయన పోయిన తర్వాత చదువు పూర్తి చేసిందిట. చివరకు బేంక్ ఉద్యోగం సంపాదించుకుంది.

ఏమయితేనేం? గతం తాలూకు నీడలు ఆమె భవిష్యత్తు మీదకు పాకటం ఆమెకు ఇష్టంలేదు. ఆరోజు సాయంత్రం విమలతో సినిమాకు వెళ్లటం నా దృష్టిలో ఓ గొప్ప సంఘటన. ఎందుకంటే కొంతమంది ఆమెకోసం ప్రయత్నాలు చెయ్యడం నాకు బాగా తెలుసు. విమల ఆ అవకాశాన్ని నాకిచ్చింది.

ఆపైన రెండు రోజులకే ఆమె నా గదికి వచ్చింది. చాలాసేపు మాట్లాడుతూ వుండిపోయాం. వెళ్లేటప్పుడు ఆమెకు తోడుగా వెళ్లాను ఇంటివరకూ-

దార్లో అడిగింది. "మనల్ని ఇలా చూస్తే ఈ మనుషులేమనుకుంటారు? ఆలోచించారా?"

"అవును. అదే ఆలోచిస్తున్నాను"

"ఏమని?"

"అలా అనుకునేవాళ్లకు మనం ఇవ్వాల్సిన జవాబు గురించి"

"కొంచెం తొందరగా ఆలోచించండి సార్... ఉద్యోగం చేస్తున్నా నేనూ అరిటాకునే"

విమల మనసులో ఏమున్నదో పూర్తిగా అర్థమయిపోయింది.

ఆరాత్రి నాకు నిద్రపట్టలేదు. కనులముందు విమల రూపం. బాగా ఆలోచించాను. విమలను పెళ్లిచేసుకోటానికే నిర్ణయించుకున్నాను. నా నిర్ణయానికి తిరుగులేదు. తల్లి-తండ్రి లేరు. పెద్దవాడిని చేసిన మేనమామ వున్నా అదృష్టవశాత్తూ ఆయనకు అమ్మాయిలు లేరు. ఆయనెప్పుడూ నాకు వ్యతిరేకి కాదు. ఆ స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని ఆయన నాకు ఎప్పుడో ఇచ్చేశాడు.

అయితే తొందరపడి నా నిర్ణయాన్ని విమలకు తెలియజెయ్యలేదు. నాకెందుకో ఆమెను ఇంకా స్టడీ చెయ్యాలని అనిపించింది. ఆమె కేవలం తనని పెళ్లిచేసుకునే మగాడికోసమే ఎదురు చూస్తోన్నదా? లేక తనని ప్రేమించే మగాడికోసం ఎదురు చూస్తుందా? తెలీదు.

నా ఆలోచనలకు ఓ చిన్న అంతరాయం.

ఎదురింట్లో నించి పెద్దగా అరుస్తూ ట్యూషన్ పిల్లలు రోడ్డు మీదకు వచ్చారు. ఎనిమిది

గంటలయివుంటుంది.

లైటార్పి గదిలోనించి బయటకు వచ్చాను.

రోడ్డుమీద నడుస్తున్నా పక్కనే విమల వున్నట్టు అనిపించింది. నా భవిష్యత్తేమిటి? అని అడుగుతున్నట్టే వుంది.

నిజమే- ఆమె భవిష్యత్తు ఏమిటి? ఏ స్వార్థం లేకుండా ఆమెను ప్రేమతో పెళ్లిచేసుకునే మగాడు ఏడీ? మరి నా సంగతేమిటి?

ఒకప్పటి నా నిర్ణయం ఆ సంభాషణతో చెదిరి పోయింది. తిరిగి దానికో రూపాన్నివ్వటం సాధ్యమా?

పదినిముషాలకు హోటలుకు వెళ్లి భోజనం చేశాను. అప్పుడూ విమలే కనపడింది.

నిజానికి ఆమె అందానికి, సంపాదనకి ఆశపడి ఏ మగాడయినా పెళ్లిచేసుకుంటాడు. కాని ఒకసారి ఆమెకు పెళ్లయి మొగుడు పోయాడనే చులకన భావం లేకుండా ఆమెతో కాపురం చెయ్యగలడా??

ఏమైనా విమల ఇప్పుడు సెకండ్‌హేండ్ వస్తువు. ఎన్ని వున్నా విలువ తక్కువే- ఈ జనం దృష్టిలో.

సిగరెట్టు వెలిగించి తిరిగి ఇంటిదారిన నడుస్తున్నాను. ఆ సంభాషణ గుర్తుకు వచ్చింది మళ్లీ.

రెండు రోజులక్రితం రాత్రి ఏడుగంటలు దాటుతున్నప్పుడు విమల గదికి వెళ్లాను. తలుపుల దగ్గరకు వెళ్లేసరికి విమల మాటలు విన్పించాయి. ఆగిపోయాను. వెంటనే మరో మగాడి గొంతు.

"నువ్వెన్నయినా చెప్పు నిరంజన్. నేను ఉద్యోగం మానేసే షరతు మీదనే నువ్వు నన్ను పెళ్లి చేసుకోగలవు"

"ఇడియట్‌లా మాట్లాడకు విమలా... నన్ను పెళ్లి చేసుకున్నంత మాత్రాన నువ్వెందుకు ఉద్యోగాన్ని మానెయ్యాలి?"

"నువ్వు నా సంపాదనకు ఆశపడడం లేదని, నా కోసం, నా ప్రేమ కోసమే నన్ను పెళ్లిచేసుకుంటున్నావని నేను క్లియర్ చేసుకోటానికి"

"నాకు పరీక్ష పెట్టటానికి నువ్వు నీ సంపాదనను పోగొట్టుకుంటావా?"

"అవును. పెళ్లయిన తర్వాత నాకు సంపాదనతో పనిలేదు. నీ సంపాదనతోనే నా జీవితం గడిచిపోతుంది. నువ్వు నన్ను పోషిస్తావుగదా?"

ఎవరీ నిరంజన్?

ఎక్కువసేపు అక్కడ నిలబడి వాళ్ల మాటలు వినే ఓపిక నాలో లేదు. అందుకే తిరిగి వచ్చేశాను.

నా గదికి వచ్చిన విమలను అడిగాను. "ఎవరా నిరంజన్?" అని-

షాక్ ఫీలయి "నీకెలా తెలుసు?" అనడిగింది విమల.

"అదంత ముఖ్యం కాదు విమలా... చెప్పు.... నిరంజన్‌కీ నీకూ మధ్యవున్న సంబంధం గురించి నాకు తెలియాలి.

"అయితే ఆ సంభాషణ విన్నావన్నమాట.. ఒకప్పటి నా ప్రేమికుడు. చదువుకునే రోజుల్లో పెళ్లి చేసుకోవాలనుకున్నాం. అప్పట్లో అతనికి ఉద్యోగం లేదు. ఇప్పుడు ఉద్యోగం వచ్చిందిట. నన్ను వెతుక్కుంటూ వచ్చాడు- పెళ్లి చేసుకుంటాడుట"

"మరి నిరంజన్ గురించి నాతో ఎందుకు చెప్పలేదు?"

"కావాలనే చెప్పలేదు. ఒకసారి దగాపడినదాన్ని. నిరంజన్ మన స్నేహానికీ, ప్రేమకీ, భవిష్యత్తుకీ కత్తెరవుతాడని భయపడి అతని గురించి నీకు చెప్పలేదు. అందుకే"

"ఇంతకీ నిరంజన్‌ని పెళ్లిచేసుకోటానికి ఇప్పుడు అభ్యంతరం యేమిటి? అతను ఒకనాటి ప్రేమికుడు కదా?"

"నిజమే. కానీ అతనిలో ఒకనాటి ప్రేమ ఇప్పుడు లేదు. అతనికి ఉద్యోగం వచ్చేవరకూ అతనికోసం ఆగలేదని నామీద కోపం వుంది. ఆకోపాన్ని నా సంపాదనతో సరిపెట్టుకోవాలని అనుకుంటున్నాడు. అందుకే అతన్ని చేసుకోగానే ఉద్యోగం మానేస్తానని చెప్పాను. ఒప్పుకోలేదు. వెళ్లిపోయాడు"

ఇప్పుడేమిటి చెయ్యడం? విమల కొత్తగా అగుపించింది.

చాలాసేపటికి అడిగింది. "నామీద నమ్మకం లేదా?"

"ఏమి చెప్పేది?"

"అంటే?" అర్థంకానట్టు అడిగింది.

"నిరంజన్ గురించి ముందుగానే చెబితే బావుండేదేమో విమలా!"

ఆమాట విమల గుండెలమీద గట్టి దెబ్బను కొట్టివుండాలి. బాణం దెబ్బ తిన్న లేడిలా నా కళ్లలోకి చూసింది.

"నిన్ను తప్పుగా అర్థం చేసుకోవటంలేదు విమలా! నాలో రేగిన అలజడి తగ్గిపోనీ... ఇది జీవితం. తొందరపాటు నిర్ణయాలు శాపాలుగా మారటం నాకిష్టంలేదు. నువ్వంటే నాకిప్పటికీ ప్రేమ వుంది. ఇష్టం వుంది"

అంతే- కొంచెం సేపటికి ఆమె నా గదిలో లేదు.

నా ఆలోచనలకు ఓ చిన్న చుక్క.

గది తలుపులు తెరిచి పక్కబట్టలతో డాబామీదకు వెళ్లాను. పడుకుంటే ఎదురుగా కన్నీళ్ళతో మళ్లీ విమల.

తప్పుకో విమలా- గట్టిగా తల విదిలించి కళ్లు మూసుకున్నాను.

xxx

విమలను పెళ్లిచేసుకునే ఆలోచనను రాత్రే తరిమివేశాను. ఒకప్పుడయినా- మరో మగాడికి మనసిచ్చిన ఆడదాన్ని అర్థాంగిగా చేసుకోటానికి మనసు ఎదురు తిరిగింది.

అయితే ఎవరు??

నా జీవితాన్ని పంచుకునే మనిషి గురించి మళ్లీ అన్వేషణ మొదలు. ఎక్కువ శ్రమలేకుండానే ఆ మనిషి ఎవరో తెలిసింది.

బేంక్‌కు వెళ్లటానికి కొంచెం ముందుగానే బయటకు వచ్చి ఎదురింట్లోకి వెళ్లాను.

ఉదయం తొమ్మిది గంటలు కావస్తోంది. వరండాలో ముసలాయన పడక్కుర్చీలో వెనక్కువాలి పడుకుని కళ్లు మూసుకుని లయబద్ధంగా మూలుగుతున్నాడు.

అడుగుల చప్పుడు విని కళ్లు తెరిచి "ఎవరు?" అని అడిగాడు.

ఎదురుగా నిలుచున్న నన్ను చూసి, "మీరా!" అని అన్నాడు.

నా గొంతు విని లోపల్నించి వచ్చింది శారద.

వచ్చి వాకిట్లో నిలబడి ఒక్కసారి నన్న చూసి లోపలకు వెళ్లిపోయింది.

ఆయన ఏం ఉద్యోగం చేశాడో తెలీదు. సంపాదన లేని మనిషి. ఆ అమ్మాయే ట్యూషన్లు చెప్పి సంపాదిస్తోంది. తండ్రినీ, పోలియో బారిన పడిన తమ్ముడినీ బతికించుకుంటోంది.

శారదకు అందం వుంది. ఇంటర్ వరకూ చదువుకుంది. ఇప్పుడు నా దృష్టి శారదమీదనే.

"ఏదయినా మాట్లాడాలనా?" అడిగాడాయన.

"అవును. ఒక ముఖ్యమైన విషయం గురించే మాట్లాడాలని వచ్చాను"

"నాతోనా!" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును" అని బయటకు చూశాను. అక్కడ శారద లేదు.

నా గురించిన వివరాలు ఆయనతో చెప్పాను. చివరగా శారదను కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటానని చెప్పాను.

అప్పుడు ఉలిక్కి పడ్డాడాయన.

"నిజంగానా?" అనడిగాడు.

"అవును. శారద నాకు నచ్చింది. ఆమె అభిప్రాయం తెలుసుకుని చెప్పండి. సాయంత్రం

మళ్లీ కలుస్తాను"

తల వూపాడాయన.

లేచి వస్తూ చూశాను. తలుపుల వెనగ్గా శారద చీర చెంగు గాలికి కదులుతూ కనపడింది తన అంగీకారాన్ని తెలియజేస్తున్నట్టు.

బేంక్‌లో పనిచేస్తున్నా ఆలోచనలన్నీ శారద చుట్టూనే.

రోజూ చూస్తున్నా శారద నా ఆలోచనల్లో ఇంతకాలం ఎందుకు చోటు చేసుకోలేదు?

సాయంత్రం బ్యాంకునుంచి రిక్షాలో గదికి వచ్చాను. తలుపు తెరిచి లోపలకు వెళుతున్నప్పుడు ఎనిమిదేళ్ల ట్యూషన్ కుర్రాడు మడతపెట్టిన కాగితాన్ని నాచేతికిచ్చి పరుగెత్తి వెళ్లిపోయాడు.

అక్కడే నిలబడి ఆశ్చర్యంతో మడత విప్పాను.

ఆ కాయితాన్ని పంపిన చేతులు శారదవని నాకు తెలుసు.

"ఉదయం మీ మాటలు విన్నాను. నన్ను కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవాలనే మీ నిర్ణయానికి థాంక్స్. కానీ క్షమించండి. మిమ్మల్ని చేసుకోటానికి నా మనసు ఎదురు తిరుగుతోంది. మీ గదికి వచ్చి రాత్రి పొద్దుపోయేవరకు మీతో కబుర్లు చెప్పే అమ్మాయి గురించి నేనేమనుకోవాలి? నన్ను చేసుకునే మనిషి కూలివాడయినా నా కిష్టమే. కాని అతని కేరక్టర్ మంచిదయివుండాలి. ఇది నా కోరిక. పెళ్లికాని ఏ అమ్మాయికయినా ఇది చాలా సహజమైన కోరికేనేమో! మరోసారి సారీ... క్షమించండి" శారద.

షర్టు విప్పి వీపుమీద ఇనుప కమ్చీలతో ఎవరో అదేపనిగా కొడుతున్నట్టు అనిపించింది.

ఇదేమిటి? శారద అంతరంగం ఇదా? సంతోషంగా వొప్పుకుని జీవితాంతం మీకు రుణపడి వుంటానంటుందని అనుకున్నాను.

ఉదయం ఈ ఆలోచన నాకెందుకు రాలేదు? నేను విమల గురించి ఆలోచించినట్లే శారద కూడా నా గురించి అలాగే అనుకుంటుందని నాకెందుకు అనిపించలేదు?

ఇప్పుడు నా దారేమిటో నాకు తెలిసింది.

ఒక్కటే దారి- మళ్లీ విమలకోసం బయటకు వచ్చాను.

(21-9-1988 ఆంధ్రప్రభ- వారపత్రికలో ప్రచురితం)